క్లుప్తంగా

వెండి పాత్ర సమర్పణ



వెండి పాత్రను అందిస్తున్న ఉదయగిరి భరత్ దంపతులు

ఐ.పోలవరం: మురమళ్లలోని శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి ఆ గ్రామానికి చెందిన ఉదయగిరి భరత్ దంపతులు రూ.10 వేల విలువైన వెండి పాత్రను శుక్రవారం సమర్పించారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం ఇచ్చారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మనోజ్

ముమ్మిడివరం: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ మహారాష్ట్ర ఎంపీ మనోజ్ కొటక్ అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ కల్యాణ మండపంలో శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మనోజ్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ అనేక పథకాలు ప్రవేశ పెడుతున్నారని అన్నారు. అనంతరం గొలకోటి వెంకటరెడ్డితో పాటు పలువురు బీజేపీలో చేరారు. నాయకులు కొప్పనాతి దత్తాత్రేయవర్మ, కొడమర్తి వెంకట రత్నంశర్మ, దంతులూరి సాయిరాజు, గ్రంధి సూర్యనారాయణగుప్తా, గోనె మడతల రవికుమార్, బసవా శ్రీహరిబాబు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం విచ్చేసిన ఎంపీ మనోజ్‌కు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీగా వెళ్లి గడియార స్తంభం సెంటర్ వద్ద ఎంపీకి స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ని సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు వేంపరాల భాస్కర్‌శాస్త్రి సత్కరించారు. మహిళా మోర్చ ప్రతినిధి చిలకమర్తి కస్తూరి, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, కళ్లకూరి గోపి, బొంతు శివాజీ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారులు

ఉప్పలగుప్తం: వేదాంత, కెయిర్న్ ఎనర్జీల సహకారంతో మిత్రా హోలిస్టిక్ ఆధ్వర్యంలో పీఎమ్ఎస్ఎమ్ఏలో భాగంగా గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎస్.యానం పీహెచ్‌సీలో వైద్యాధికారులు బి.లోవసుధ, జి.ఢిల్లీప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బీర బాలరాజు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఉప్పలగుప్తం: ఆక్వా చెరువుల వ్యర్థాలతో సన్నవిల్లిలోని రజక చెరువు కలుషితం అవుతుందని తహసీల్దార్ వెంకటేశ్వరికి గ్రామస్తులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రసాయనాలతో కూడిన నీటిని పరిసర ఆక్వా రైతులు బయటకు తోడటంతో ఆ నీరు రజక చెరువులోకి ప్రవేశించి చేపలు చనిపోతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపేట: మామిడిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ జారి పడి వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానిక ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఖండ్రిగ పంచాయతీ పులుసుగంటివారిపేటకి చెందిన పులుసుగంటి సత్యనారాయణ (50) గత నెల 20న తన ఇంటి సమీపాన ఉన్న మామిడిచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు అతడిని రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. అప్పటికే అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

యువకుడిపై కిడ్నాప్ కేసు

అంబాజీపేట: ఓ బాలికను తన ఇంటి వద్ద నుంచి బలవంతంగా తీసుకుపోయాడని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పుల్లేటికుర్రు శివారు చినలంకకు చెందిన గుమ్మడి ప్రసాద్ తన కుమార్తె ఈ నెల 6వ తేదీ నుంచి కనిపించడం లేదన్నారు. అదే చినలంకకు చెందిన చిల్లే రత్నంరాజు తన ఇంటికి వచ్చి అర్ధరాత్రి సమయంలో బలవంతంగా తీసుకుని వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో కిడ్నాప్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సొంతింటివారమండి..

- ఉబ్బితబ్బిబ్బవుతున్న పేదలు
- సీఎం జగన్‌తో వారి కల సాకారం
- కొత్త ఊళ్లను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- అమలాపురం రూరల్‌లో 2015 మందికి స్థలాలు



సమనస జగనన్న కాలనీలో రూపుదిద్దుకున్న ఇళ్లు

అమలాపురం రూరల్: మా జీవితాలకు పెద్ద పండగ వచ్చిందని పేదలు మురిసిపోతున్నారు.. మేమూ సొంతింటి వారమేనండని సగర్వంగా చెప్పుకొంటున్నారు. ఏళ్లనాటి కల తీరిందని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో పేదల హరివిల్లులు రూపుదిద్దుకుంటున్నాయి. అక్కడ గృహ నిర్మాణాల వేగం పుంజుకొంది. పేదల సొంతింటి కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నిజం అవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అమలాపురం రూరల్ మండలంలో 11 లేవుట్‌లలో 2015 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇందులో అందరికీ గృహ నిర్మాణ శాఖ ద్వారా రుణాలు మంజూరయ్యాయి. ఈ మేరకు సమనస, తాండవపల్లి, నల్లమిల్లి, రోళ్లపాలెం, పాలగుమ్మి, పేరూరు, చిందాడగరువు, ఎ.వేమవరం తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గృహ నిర్మాణ శాఖ ద్వారా రూ.1.80 లక్షల పూర్తి రాయితీతో ఇంటి నిర్మాణానికి రుణం అందిస్తున్నారు. మహిళా సంఘాలకు రూ. 50 వేలు అదనంగా రుణాలను బ్యాంకుల నుంచి ఇస్తున్నారు. ఇంటి రుణంలో రాయితీపై సిమెంట్, ఇసుకతో పాటు ఐరన్ కూడా ప్రభుత్వం అందజేస్తుంది. ఇంటి పునాదులు పూర్తయితే రూ.51,200, గోడలు నిర్మిస్తే రూ.53,200, మోల్డింగ్ వేసుకుంటే రూ.22,400, ప్లాస్టింగ్ పూర్తయితే మరో రూ.23,200 నగదు నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న జగనన్న కాలనీల్లో మెరక పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. అక్కడ రోడ్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలను వంటి మౌళిక సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంటే.. ఇళ్ల నిర్మాణ పనుల్లో లబ్ధిదారులు బిజీగా ఉన్నారు. ఇప్పటికే కొందు లబ్ధిదారుల సొంతింటిని నిర్మించుకున్నారు.

అమలాపురం రూరల్‌లో లబ్ధిదారుల వివరాలు

మంజూరైన స్థలాలు	:	2015
గృహ రుణాల లబ్ధిదారులు	:	2015
పునాది స్థాయిలో ఇళ్లు	:	172
గోడలు పూర్తయినవి	:	37
మొత్తం పూర్తయిన ఇళ్లు	:	214
ఇంకా ప్రారంభించనివి	:	1592

ఆనందంగా ఉంది



కూలి పనికి వెళితే గాని పూట గడవని పరిస్థితి. సొంతిల్లు ఆశ కలగానే మిగులుతుందని అనుకున్నాం. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన సెంటున్నర స్థలంలో ఇల్లు కట్టుకుంటున్నాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా మాకు ఇంటి స్థలం ఇవ్వలేదు. జగనన్న ముఖ్యమంత్రిగా వచ్చాక స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు నిర్మించుకుంటున్నాం.

–షేక్ అమ్మాజీ, లబ్ధిదారు, నల్లమిల్లి

సీఎం సహకారం ఎనలేనిది



అద్దె ఇంట్లోనే ఉంటూ పిల్లలతో అనేక ఏళ్లు ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక జగనన్న లేఅవుట్‌లో ఇచ్చిన స్థలంతో పాటు అందించిన రూ.1.80 లక్షల రుణంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. మేము సొంతింట్లో జీవించడానికి సీఎం జగనన్న అందించిన సహకారం మరువలేనిది.

–కుడనలపల్లి కుమారి, సమనస

రుణపడి ఉంటాం



భార్యభర్తలిద్దరం కూలీ పనులు చేస్తుంటాం. ఎన్నో ఏళ్లు ఓ పాకలో పిల్లలతో మా కుటుంబం అంతా జీవించాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మా గ్రామంలోని లేఅవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చింది. ఇంటి రుణం కూడా ఇవ్వడంతో సొంతిల్లు నిర్మించుకున్నాం. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

–దారా అనంతలక్ష్మి, వెర్రియ్య, సమనస

అద్దె ఇళ్లలో అవస్థలు పడ్డాం



మాది చిన్న కుటుంబం. నా భర్త సెంట్రింగ్ పనులు పనిచేస్తున్నారు. చాలాకాలం ఇద్దరు పిల్లలతో అద్దె ఇళ్లలో జీవించాం. ప్రస్తుత ప్రభుత్వం స్థలం ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకున్నాం. మంత్రి విశ్వరూప్ చేతుల మీదుగా మా ఇంటి గృహప్రవేశం జరగడం ఆనందంగా ఉంది. సొంతిల్లు సమకూరడంతో ఆనందంగా ఉన్నాం.

–గెద్దం దుర్గ, లబ్ధిదారు, ఎ.వేమవరం

డాక్టర్ సర్వేశ్వరశర్మకు సత్కారం



డాక్టర్ సర్వేశ్వరశర్మను సత్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: స్థానిక కలెక్టరేట్‌లో కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు, సైన్స్ రచయిత డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మను కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం సత్కరించారు. డాక్టర్ సర్వేశ్వరశర్మ ఇటీవల డాక్టర్ ఇన్ సైన్స్ డిగ్రీ పొందడంతో పాటు ప్రయిడ్ ఆఫ్ ఇండియా అవార్డు, లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును కైవసం చేసుకున్న సందర్భాలను పురస్కరించుకుని ఆయనను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర సమన్వయకర్త జేవీఎస్ కుమార్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ కేఎస్ నారాయణ్, అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఇమ్మి అయ్యప్పనాయుడు కూడా సర్వేశ్వరశర్మను అభినందించారు. నాలుగు దశాబ్దాలుగా కోనసీమ సైన్స్ పరిషత్ ఆధ్వర్యంలో మహాసభల నిర్వహణతో విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెంచారని వారు అన్నారు.

రక్షణ కల్పించండి

అల్లవరం: సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతిని ప్రశ్నించే దరఖాస్తుదారులకు రక్షణ కల్పించాలని స.హ. చట్టం జిల్లా సంయుక్త కార్యదర్శి లూటుకుర్తి చిన్నా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌టీఐ ద్వారా సమాచారాన్ని దరఖాస్తుదారుడు కోరినప్పుడు భౌతిక దాడులకు పాల్పడితే వెంటనే పోలీసులను సంప్రదించాలని అన్నారు.

హైటెక్ బండి.. అడ్డం తియ్యండి!



అమలాపురం కలశం సెంటర్‌లో హైటెక్ బస్సులతో ట్రాఫిక్ ఇలా..

అమలాపురం టౌన్: అసలే అమలాపురం ట్రాఫిక్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇది సరిపోదన్నట్టు స్థానిక కలశం సెంటర్ మెయిన్ రోడ్డులో ప్రైవేట్ హైటెక్ బస్సుల అనధికార నిలుపుదలతో సమస్య జఠిలమవుతోంది. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇదే పరిస్థితి. హైదరాబాద్ నుంచి వచ్చిన బస్సులతో ఉదయం, హైదరాబాద్‌కు వెళ్లే బస్సులతో సాయంత్రం కలశం సెంటర్ కిక్కిరిసిపోతోంది. దాదాపు 20 బస్సుల వరకూ ఈ రోడ్డులో ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడం చేస్తున్నారు. ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా పట్టణ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం



కళ్లజోళ్లు, మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఓఎన్జీసీ అధికారులు

యానాం: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక మహాత్మా గాంధీ ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలోని చిల్డ్రన్స్ ఆడిటోరియంలో ఓఎన్జీసీ ఈస్టర్న్ ఆఫ్‌షోర్ అసెట్ వారి ఆధ్వర్యంలో ఉత్థాన్ సేవా సమితి, యానాం లయన్స్ క్లబ్ (పిల్లారాయ), పరమహంస యోగానంద నేత్రాలయ ఆఫ్ డివైన్ ఐ ఫౌండేషన్ వారి నిర్వహణలో ఉచిత మెగా స్పెషాలిటీ క్యాంప్ అండ్ క్యాటరాక్ట్ ఆపరేషన్ క్యాంప్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్థానిక జీజీహెచ్‌లో మెరుగైన సౌకర్యాల కల్పన, స్పెషలిస్ట్ వైద్యుల నియామకం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం 535 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 246 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా 55 మందికి కంటి శస్త్రచికిత్సల నిమిత్తం పరమహంస యోగానంద నేత్రాలయ ఫౌండేషన్‌కు తరలించారు. ఆర్‌ఏఓ మునిస్వామి, సీఐ షణ్ముగం, విద్యుత్ శాఖ ఏఈ లంక కృష్ణారావు, జీజీహెచ్ ఏడీ పలాష్‌కుమార్ పాన్యల్, ఓఎన్జీసీ ఈఓ(సీఎస్ఆర్) సదాఅన్వర్, లయన్స్ అధ్యక్షుడు పులవర్తి శ్రీను పాల్గొన్నారు.

యానాంలో జన్ భాగిదరి

యానాం: కేంద్ర ప్రభుత్వం జన్ భాగిదరి కార్యక్రమాన్ని యానాంలో సైతం నిర్వహిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరికీ అక్షరాస్యత, సంఖ్యాశాస్త్ర నైపుణ్యాల్లో భాగంగా జన్ భాగిదారి కార్యక్రమం 15 వరకు అమలు చేస్తున్నామన్నారు. సమావేశంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, నవోదయ వైస్ ప్రిన్సిపాల్ బేగం పాల్గొన్నారు.

సంస్మరణ సభ విజయవంతానికి పిలుపు

తాళ్లరేవు: మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు సంస్మరణ సభను ఈ నెల 11న తాళ్లరేవులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్ తెలిపారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో దొమ్మేటి అభిమాన సంఘం ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహణ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల నుంచి ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కాశి లక్ష్మణస్వామి, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, నాయకులు పంపన రామకృష్ణ, అత్తిలి బాబూరావు పాల్గొన్నారు.

యోగా దినోత్సవంపై సమీక్ష

యానాం: యోగా దినోత్సవాన్ని ఈ నెల 21న నిర్వహించేందుకు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ ఛాంబర్‌లో ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ రోజు స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేలా కృషి చేయాలని కోరారు.

విద్యా ప్రణాళికపై నేడు శిక్షణ

యానాం: స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో కరిక్యులమ్‌పై ఉపాధ్యాయులకు ఒక రోజు ఓరియంటేషన్ శిక్షణ శనివారం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు సత్కారం



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్యాంప్రసాద్

అల్లవరం: గోడి బాలుర గురుకులం కొత్త ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.శ్యాంప్రసాద్ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ గ్రామంలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేద కుటుంబాల్లో పిల్లలు చదువుకుంటున్న గురుకులంలో నాణ్యమైన విద్య అందిస్తూ, పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. గురుకులంలో సౌకర్యాల కల్పనపై దృష్టి సారిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు భుజంగరావు, కొండలరావు, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు

తాళ్లరేవు: వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రభుత్వం అందించే పథకాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాయుడు సునీత కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. దీనికి కరప సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.బాబూరావు హాజరై మాట్లాడుతూ తొలకరి సాగుకు ముందుగానే జూన్ 1న నీరు విడుదల చేశారన్నారు. రైతులంతా వెదజల్లు, బెంగాల్ ఊడ్పులు, నారుమడులు కూడా జూలై 15 నాటికి పూర్తి చేస్తే నవంబర్‌లో వచ్చే తుపానుల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. ఆర్బీకేలలో నానో యూరియా, భాస్వరం, ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి రైతు సాగుకు ముందుగానే విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు.

చెరువుల ఆధునీకరణ పరిశీలన



ఉపాధి పనుల ప్రదేశంలో శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి ప్రసాద్

అల్లవరం: అమృత్ సరోవర్ పథకంలో భాగంగా గూడాల, గోడిలంక గ్రామాల్లో ఉపాధి కూలీలచే పంచాయతీ చెరువుల ఆధునీకరణ పనులను రాష్ట్ర నోడల్ అధికారి వైవీవీ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ పథకంలో నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించారా లేదా అనే అంశంపై పరిశీలన చేశారు. పదిహేను రోజుల్లో మరోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలన అనంతరం కేంద్రం నుంచి నిధులు మంజూరు చేస్తామని ప్రసాద్ తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో పనులు సంతృప్తికరంగా జరిగాయన్నారు. ఆయన వెంట జిల్లా పీడీ మధుసుదన్‌రావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, ఏపీడీ చంద్రమోహన్, ఎంపీడీఓ సరోవర్, ఏపీఓ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు ప్రత్యేక పూజలు



మావుళ్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సర్పంచ్ శివాళిని దంపతులు

అమలాపురం రూరల్: ఇందుపల్లి గ్రామ దేవత మావుళ్లమ్మ అమ్మవారికి గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాళిని అప్పాజీ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. తొలిత పంచాయతీ కార్యాలయం నుంచి సర్పంచ్, గ్రామ పెద్దలు ఆలయం వరకూ ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ శివాళిని అప్పాజీలను ఆలయం తరపున కమిటీ సభ్యులు సత్కరించారు. తీర్థం సందర్భంగా మావుళ్లమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉప సర్పంచ్ ఉర్రింకి బుజ్జి, కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు, నాయకులు మల్లుల పోలయ్య, పిల్లా భీమన్న, పిల్లా వెర్రయ్య, అడపా బుజ్జి, బండి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ వేసవి హాట్ గురూ..



నిర్మానుష్యంగా అంబాజీపేట ప్రధాన కూడలి

అంబాజీపేట: రోహిణీ కార్తె ముగిసి మృగశిర కార్తె ప్రవేశించినప్పటికీ తొలకరించలేదు సరికదా రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరుగుతూ మంటలు పుట్టిస్తోంది. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. గత వారం రోజులుగా ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత ప్రారంభం కావడంతో ప్రజలు బయటకు రావడానికి సాహసించడం లేదు. రాత్రి నుంచి తెల్లవార్లు వాతావరణం వేడిగానే ఉంటోంది. శుక్రవారం ఉష్ణోగ్రత 45 డిగ్రీలు ఉండటంతో ఇళ్ల నుంచి బయటకు వస్తుంటే నిప్పుల కుంపటిని తలపించి వేడిగాలులు వీస్తుండటంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వస్తున్న ప్రజలు ఎండ నుంచి రక్షణ పొందేందుకు ముఖానికి మాస్కులు వేసుకుంటున్నారు. ఎండలకు తోడు వడ గాలులు వీస్తుండటంతో దప్పికకు గురవుతున్నారు. ప్రధాన కూడళ్లలో ఎక్కడా చలివేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం దారుణమని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



లక్ష్మీ గణపతి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

అమలాపురం టౌన్: స్థానిక నల్లా గార్డెన్స్‌లో లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పప్పొప్పుల నారాయణ మూర్తి, శ్రీదేవి సత్య దంపతులు కర్తలుగా లక్ష్మీగణపతి స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ స్వామికి విశేష పూజాదికాలు, అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉద్దిశపు వెంకటేశ్వరరావు, లంకలపల్లి భీమేశ్వరరావులు ప్రసాదాన్ని సమకూర్చారు.

ఉచిత పాస్‌ల జారీకి ఆర్టీసీ చర్యలు

అమలాపురం రూరల్: విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పదో తరగతి వరకూ చదివే విద్యార్థులు అంటే 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఆర్టీసీ ఉచిత బస్ పాస్‌లు జారీ చేయనున్నారు. ఈ ప్రక్రియను 12వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత పాస్‌ల కోసం పాఠశాల స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, పూర్తి చేసిన బస్ పాస్ దరఖాస్తు అందించాలన్నారు. ఉచిత బస్ పాస్‌లతో పాటు కన్సెషన్ బస్ పాస్‌లను ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు జారీ చేస్తామని వివరించారు. దివ్యాంగులకు పీహెచ్‌సీ పాస్‌లు ఇస్తామన్నారు.

నారుమడులు సిద్ధం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జిన్నూరి వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం: రైతులంతా ఖరీఫ్ నారుమడులు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయాధికారి జి.కుమార్ బాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేలలో విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. గోపవరం, భీమనపల్లి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం గ్రామాల రైతులు మాట్లాడుతూ కాలువకు నీరు విడుదల చేసినప్పటికీ కొన్ని ప్రాంతాలకు పూర్తి స్థాయిలో రావడం లేదన్నారు. రంగరాజు కోడు మీడియం డ్రెయిన్ తవ్వకం పనులు జరగక పోవటంతో గొల్లవిల్లి, భీమనపల్లి, కిత్తనచెరువు, సన్నవిల్లి, నంగవరంలో ఖరీఫ్ పంట ముంపునకు గురై ఇబ్బందులు ఎదర్కొంటున్నామన్నారు. వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామన్నారు. రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలసుబ్రహ్మణ్యం, సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు, ఎఫ్‌డీవో ఎస్.నాగమణి, పశువైద్యాధికారి జి.విజయదుర్గ పాల్గొన్నారు.